రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 2 : మండలంలోని బొర్రోళ్లగూడెం గ్రామం వద్ద 65వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. ఎస్ఐ కె.యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎస్.లింగోటం గ్రామం నుంచి హైదరాబాద్‌కు టీవీఎస్ ఎక్సెల్‌పై బానోతు రమేశ్, ఆయన భార్య కౌసల్య (40), కుమారుడు మహేందర్‌మంజే వెళ్తున్నారు. బొర్రోళ్లగూడెం వద్ద వాహనం వెనుకాల కూర్చున్న కౌసల్య జారి కింద పడగా.. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

రామన్నపేట, నవంబర్ 2 : మండలంలోని కక్కిరేణి గ్రామానికి చెందిన నూకల మనీషా (21) అదృశ్యమైనట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. అక్టోబర్ 24న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మనీషా బయటికి వెళ్లింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కల ఇండ్లల్లో వాకబు చేసినా ఆచూకీ తెలియలేదు. యువతి తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి చేశారని కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 2 : పట్టణానికి చెందిన హస్తం మల్లేశంతోపాటు మరో ఇద్దరు తనపై దాడి చేశారని మున్సిపాలిటీలోని లక్కారం స్టేజీ వద్ద పాన్ షాపు నిర్వహిస్తున్న సోహైల్ శనివారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తనను అకారణంగా దుర్భాషలాడి కర్రతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయం అయ్యిందన్నారు. గాయపరచిన మల్లేశం, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.యాదగిరి తెలిపారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 2 : మండలంలోని పంతంగి గ్రామంలో శనివారం సాయంత్రం చౌటుప్పల్ పోలీసులు సోదాలు చేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. పంతంగి గ్రామానికి చెందిన బోయ యాదయ్యకు చెందిన కిరాణా దుకాణంలో సోదా చేయగా 28 బీర్లు, పలు రకాల వైన్ లభించింది. వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వైన్స్‌లో తక్కువ ధరకు కొని గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.యాదగిరి తెలిపారు.

జస్టిస్ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్‌కు సన్మానం

రామన్నపేట, నవంబర్ 2 : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ దీపావళి పండుగకు తన స్వగ్రామం మండలంలోని బోగారానికి వచ్చారు. ఆయనను రామన్నపేట బార్ అసోసియేషన్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సబ్ కోర్టు ప్రారంభ ఫొటో ఆల్బమ్‌ను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ మజీద్, సీనియర్ న్యాయవాదులు పి.అశోక్‌కుమార్, జినుకల ప్రభాకర్, ఉయ్యాల హనుమంతుగౌడ్, డేవిడ్, నకిరేకంటి మొగులయ్య, నోముల స్వామి, మామిది వెంకట్‌రెడ్డి, దినేశ్‌కుమార్, యాదాసు యాదయ్య, శ్రవణ్‌కుమార్, సత్తయ్య పాల్గొన్నారు.

స్కిల్ వర్సిటీ వరకు మెట్రో

24,269 కోట్లు 76.4 కి.మీలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మెట్రో 2.0

ప్రాజెక్టు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు

జీవో నంబర్ 196 జారీ

సిటీబ్యూరో, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరంలో రెండో దశ మెట్రో ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టనున్నామని తెలంగాణ సర్కారు వెల్లడించింది. దీనికి సంబంధించి రాష్ట్ర పురపాలక శాఖ మెట్రో ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పరిపాలనా అనుమతులు ఇస్తున్నట్లు జీవో ఎంఎస్. నంబర్ 196ను శనివారం జారీ చేసింది. నగరం విస్తరిస్తున్న కొద్దీ ట్రాఫిక్ రద్దీ పెరగడంతో ఇప్పుడున్న మెట్రోను ఇతర మార్గాలకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందుకు సంబంధించిన డీపీఆర్‌లను వారం రోజుల కిందటే రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. రెండో దశలో 5 మార్గాల్లో మొత్తం 76.4 కి.మీ మేర నిర్మించే ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ. 24,269 కోట్లు అవుతుందని అంచనా వేశారు. అందులో 30 శాతం రూ. 7313 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, 18 శాతం రూ.4,230 కోట్లు కేంద్ర ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంటుంది. అదేవిధంగా జైకా, ఏబీడీ,ఎన్‌డీబీ సంస్థల నుంచి 48 శాతం చొప్పున అప్పుగా రూ.11,693 కోట్లు, మిగతా 4 శాతమైన రూ.1033 కోట్లను పీపీపీ విధానంలో వెచ్చించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి ఆర్థిక శాఖ నుంచి అనుమతులు వచ్చాయి.

మొదటి దశకు విశేష ఆదరణ

మెట్రో మొదటి దశకు ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ ఉందని, ప్రతి రోజూ 5లక్షలకు పైగా ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారని ప్రభుత్వం పేర్కొంది. మొదటి దశకు అనుసంధానంగా మరో 6 కారిడార్లను నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొదటి దశ మెట్రోను పూర్తిగా పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో రూ. 22వేల కోట్ల వ్యయంతో నిర్మించగా, ఇది ప్రపంచంలో అతి పెద్ద పీపీపీ మెట్రో ప్రాజెక్టుగా నిలిచింది. నగరంలో వాయు కాలుష్యం నివారించడంతో పాటు అత్యాధునిక ప్రజా రవాణా వ్యవస్థగా మెట్రో రైలు అవసరమని గుర్తించి రెండోదశను మొత్తం 116.4 కి.మీ మేర నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. పార్ట్-ఏలో 76.4 కి.మీ, పార్ట్-బీలో 40 కి.మీ దూరంతో రెండో దశ నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు వెళ్లనున్నదని జీవోలో పేర్కొన్నారు.

రెండో దశలో నిర్మించే మెట్రో మార్గాలు..

- కారిడార్-4: నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు 36.8 కి.మీ. (ఎయిర్‌పోర్టు కారిడార్)
- కారిడార్-5: రాయదుర్గం-కోకాపేట నియోపోలిస్-11.6 కి.మీ
- కారిడార్-6: ఎంజీబీఎస్- చాంద్రాయణ గుట్ట- 7.5 కి.మీ(ఓల్డ్ సిటీ కారిడార్)
- కారిడార్-7: మియాపూర్- పటాన్‌చెరు - 13.4 కి.మీ
- కారిడార్-8: ఎల్బీనగర్ - హయత్‌నగర్ - 7.1 కి.మీ
- కారిడార్-9: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీలోని స్కిల్ యూనివర్సిటీ వరకు 40 కి.మీ
- రెండో దశ పార్ట్-ఏలో నిర్మించే మొత్తం దూరం 76.4 కి.మీ
- రెండో దశ పార్ట్-బీలో నిర్మించే మొత్తం 40 కి.మీతో కలిపి మొత్తం మెట్రో రెండో దశ కారిడార్ల దూరం 116.4 కి.మీ.

కారిడార్-9గా ఫోర్త్ సిటీ మెట్రో..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రకటించిన ఫోర్త్ సిటీకి మెట్రో కారిడార్ నిర్మాణానికి హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ప్రతిపాదనలు రూపొందిస్తున్నది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఓఆర్ఆర్ మీదుగా కొంగరకలాన్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు 40 కి.మీ దూరంతో నిర్మించేందుకు డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. కారిడార్-9గా నిర్మిస్తున్న ఫోర్త్ సిటీ మెట్రో మార్గానికి సైతం ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చింది. దీనికి సంబంధించి అలైన్‌మెంట్, ఇతర ఫీచర్లు, ప్రాజెక్టు నిర్మాణ వ్యయంపై మెట్రో అధికారులు అంచనాలు సిద్ధం చేస్తున్నారని జీవోలో పేర్కొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణ.. పంచారామాలకు ప్రత్యేక బస్సులు

సుల్తాన్‌బజార్, నవంబర్ 2: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో అరుణాచల గిరి ప్రదక్షిణ, పంచారామాల దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీలత శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 13న ఎంజీబీఎస్, బీహెచ్ఈఎల్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు ప్రారంభమవుతాయని ఆమె వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా కాణిపాకం, వెల్లూరులోని శ్రీ నారాయణి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం 16న తిరిగి ప్రత్యేక బస్సులు హైదరాబాద్‌కు చేరుకుంటాయని చెప్పారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ స్పెషల్ బస్సుల టికెట్ బుకింగ్ కోసం www.tgsrtconline.in లో లేదా టీజీఎస్ఆర్‌టీసీ అన్ని కౌంటర్‌లలో బుక్ చేసుకోవాలన్నారు. ఈ నెల 13న పటాన్‌చెరూ, రామచంద్రాపురం, బీహెచ్ఈఎల్, మియాపూర్, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట, ఎంజీబీఎస్, జేబీఎస్ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు వివరించారు. అరుణాచలం వెళ్లే భక్తులు బీహెచ్ఈఎల్ నుంచి సూపర్ లగ్జరీ రూ. 4000, రాజధాని రూ. 5360, ఎంజీబీఎస్ నుంచి సూపర్ లగ్జరీ రూ. 3900, రాజధాని రూ. 5230 టికెట్ చార్జీలను నిర్ణయించినట్లు చెప్పారు. మరింత సమాచారం కోసం 9959226149, 9959226153,9959226249, 9959226250 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అంతే కాకుండా ఈ నెల 3న ప్రతి ఆదివారం పంచారామాల ప్రత్యేక ప్యాకేజీని మియాపూర్ డిపో-1 నుంచి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ నెల 3న, 10న, 17న, 24వ తేదీల్లో పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట లోని శివాలయాలకు ప్రతి సోమవారం రాత్రి పది గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి మియాపూర్ డిపో-1కు బస్సులు చేరుకుంటాయన్నారు.

ప్రభుత్వ స్థలం.. ప్రైవేటు భూమిగా..

ఇద్దరు వ్యక్తుల నుంచి రూ. 2 కోట్లు వసూలు... నిందితుడి అరెస్టు

సిటీబ్యూరో, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమిని ప్రైవేటు స్థలంగా చిత్రీకరించి ఇద్దరు వేర్వేరు వ్యక్తులకు విక్రయించే క్రమంలో రూ.2 కోట్లు వసూలు చేసిన ఘరానా మోసగాడిని సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు అరెస్టు చేశారు. ఈవోడబ్ల్యూ డీసీపీ ప్రసాద్ కథనం ప్రకారం...మేడ్చల్ జిల్లా, సూరారం ప్రాంతానికి చెందిన ఎన్‌వీవీ సుబ్రహ్మణ్యం సూరారం కాలనీలోని నిఖిల సాయి మైత్రేయ మధుసూదన సరస్వతీ పీఠంలో పూజారి. అయితే మెదక్ జిల్లా, శివంపేట మండలంలో ఓ ఖాళీ స్థలం కొని అక్కడ దేవాలయాన్ని నిర్మించాలని భావించి, అనువైన ఖాళీ స్థలం కోసం అన్వేషిస్తుండగా, 2018లో శివంపేట తహసీల్దార్ కార్యాలయంలో మెదక్ జిల్లా, శివంపేట మండలం, రత్నాపూర్ గ్రామానికి చెందిన ఉదండపురం నర్సింహులు పరిచయమయ్యాడు. తాను తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగినని, త్వరలో తనకు డిప్యూటీ తహసీల్దార్ పదోన్నతి రానున్నట్లు నర్సింహులు నమ్మబలికాడు. దీంతో పూజారి సుబ్రహ్మణ్యం తాను స్థానికంగా ఒక దేవాలయ నిర్మాణానికి యోచిస్తున్నానని, అందుకోసం అనువైన ఖాళీ స్థలం కోసం వెతుకుతున్నట్లు వివరించాడు. దీంతో తాను దేవాలయం నిర్మాణానికి అనువైన స్థలాన్ని చూపిస్తానని చెప్పి.. శివంపేట మండలంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పూజారికి చూపించాడు. ఆ స్థలానికి సంబంధించి ఫోర్జరీ సంతకాలతో నకిలీ పత్రాలు సృష్టించి.. బాధితుడికి చూపించాడు. బాధితుడు నుంచి అడ్వాన్స్‌గా రూ.1.20 కోట్లు తీసుకున్నాడు. అదే తరహాలో మరో బాధితుడు ఆలేటి కుమార్ వద్ద నుంచి కూడా రూ.50 లక్షలు వసూలు చేశాడు. కానీ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించకుండా కాలయాపన చేస్తుండడంతో అనుమానం వచ్చిన బాధితులు.. సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరిపి నిందితుడు నర్సింహులును అరెస్టు చేశారు.

రెండు ద్విచక్ర వాహనాలు చోరీ

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 2 : పట్టణంలో ఇటీవల రెండు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురైనట్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్న కొంపల్లి మధు పట్టణంలోని జగన్నాథ్ ట్రేడర్స్ షాపు వద్ద శుక్రవారం రాత్రి తన ద్విచక్ర వాహనం పార్కింగ్ చేశాడు. ఉదయం లేచిచూడగా వాహనం కనబడలేదు. అదే ట్రేడర్ ముందు గత నెల 23న పార్క్ చేసిన పట్టణంలోని మార్కండేయనగర్‌కు చెందిన గోషిక ధనుంజయ బైక్ కూడా కనబడలేదు. బాధితులు శనివారం చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.యాదగిరి తెలిపారు.

హాకీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఆలేరు విద్యార్థుల ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ధనుంజనేయులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 2 : హాకీ రాష్ట్ర స్థాయి అండర్-17 పోటీలకు ఆలేరు ఖేలో ఇండియా సెంటర్ విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కె.ధనుంజనేయులు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి బాలుర జిల్లా జట్టు ఎంపిక పోటీలను నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించగా.. ఆలేరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. కోచ్ ఆర్.మురళి సారథ్యంలో విద్యార్థులు జి.సందీప్, బి.సాయిగణేశ్, ఎన్.సాయిగణేశ్, జి.దుర్గాప్రసాద్, ఆర్.మణి శిక్షణ పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వారు ఈ నెల 5, 6, 7 తేదీల్లో సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను శనివారం సన్మానించి అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మర్యాల విద్యార్థులు

విద్యార్థులకు ప్రశంసా పత్రం అందజేస్తున్న జీహెచ్ఎం నిర్మలజ్యోతి

బొమ్మలరామారం, నవంబర్ 2 : సూర్యాపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అండర్-14 బాలికల ఖోఖో పోటీల్లో మర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారు ఆదివారం నుంచి కామారెడ్డిలో జరిగే 68వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక అయ్యారని జడ్పీహెచ్ఎస్ జీహెచ్ఎం పి.నిర్మలజ్యోతి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జగ్గారి హరిష్మా, శ్రేష్ఠను అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. పీఈటీ గోపాల్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, స్వరూపారాణి, సుజాత, శ్రీధర్, నాగజ్యోతి, శ్రీదేవి, సుష్మ, భవాని పాల్గొన్నారు.

వంగపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మోటకొండూర్, నవంబర్ 2 : వంగపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్ శనివారం ప్రారంభించారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఏఓ రమాదేవి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎగ్గిడి బాలయ్య, ఏఈఓ శివాణి, పీఏసీఎస్ సెక్రటరీ భద్రారెడ్డి, పాండురంగయ్య పాల్గొన్నారు.

ఇండ్లపై హైటెన్షన్ తీగలు పడి..

పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు ..ఉలిక్కిపడ్డ ఎల్లారెడ్డిగూడ

సర్కారు బడి, గృహాలపై పడిన కరెంటు వైర్లు

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ప్రార్థన చేస్తుండగా ఘటన

భయంతో పరుగులు పెట్టిన ప్రజలు

శ్రీనగర్‌కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించిన స్థానికులు

ఎల్లారెడ్డిగూడ వాసుల నిరసనకు మద్దతు తెలుపుతున్న సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతా శ్రీనివాస్ యాదవ్

వెంగళరావునగర్, నవంబర్ 2 :సర్కార్ బడిపై, ఇండ్లపై హైటెన్షన్ విద్యుత్ తీగలు ఒక్కసారిగా తెగిపడ్డాయి. పెద్ద శబ్దంతో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయాయి. 8 గంటల సమయంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు తెగి సర్కారు బడి భవనం, స్థానికుల ఇండ్లపై పడిపోవడంతో సర్కారు బడి, ఇండ్లల్లో నుంచి ఆర్తనాదాలు చేస్తూ జనం బయటకు పరుగులు తీశారు. సోమాజిగూడలోని ఎల్లారెడ్డిగూడ వడ్డెర బస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఉదయం ప్రార్థన చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గతంలో ఎత్తరి మనీలా అనే మహిళ హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు పోగొట్టుకున్నది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ శాఖాధికారుల్లో చలనం లేకపోవడంతో ఆగ్రహించిన మహిళలు, స్థానికులంతా కలిసి శ్రీనగర్‌కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన నిర్వహించారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

> **హైటెన్షన్ విద్యుత్ తీగలను భూగర్భం నుంచి వేయాలి:**
>
> కార్పొరేటర్ సంగీతా శ్రీనివాస్‌యాదవ్
>
> ప్రమాదభరితంగా మారిన హైటెన్షన్ విద్యుత్ తీగలను ఇండ్లు, బడి వద్ద నుంచి తొలగించి..ఈ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ కరెంటు కేబుళ్ల పనులను అధికారులు వెంటనే చేపట్టాలని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతా శ్రీనివాస్‌యాదవ్ కోరారు. పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను కార్యరూపం దాల్చేందుకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. మున్ముందు ప్రమాదాలు జరగకుండా ప్రజల ప్రాణాలను రక్షించేందుకు హైటెన్షన్ కరెంటు తీగలను భూగర్భం నుంచి వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో పనులు

ఇప్పటికే ఈ లైన్ తొలగింపునకు సిఫార్సు చేశామని, ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో ఉన్నదని, త్వరితగతిన ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఏడీఈ ప్రేమ్‌కుమార్ తెలిపారు. స్థానికులకు భరోసా ఇచ్చారు. పంజాగుట్ట, రహ్మత్‌నగర్ లో సైతం విద్యుత్ సరఫరా లోపాలతో హైటెన్షన్ తీగలు తెగాయని వీటికి మరమ్మతులు చేస్తున్నామని,శాశ్వత పరిష్కారాలను చేపడతామని చెప్పారు.

బీర్ బాటిల్‌లో నాచు

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 2 : బీరు బాటిల్‌లో నాచు కనిపించడంతో మద్యం ప్రియులు షాక్‌కు గురయ్యారు. మండల కేంద్రంలోని మహంకాళి వైన్స్‌లో శనివార ఓ వ్యక్తి కింగ్ ఫిషర్ బీర్లు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాడు. ఓపెన్ చేసే సమయంలో ఒక బాటిల్‌లో నాచు కనిపించడంతో కంగుతిన్నారు. వైన్స్ వద్దకు వచ్చి సిబ్బందిని నిలదీయగా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతున్న వైన్స్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు డిమాండ్ చేశారు.

12న ఏఐటీయూసీ శిక్షణ తరగతులు

చౌటుప్పల్, నవంబర్ 2 : పట్టణంలో ఈ నెల 12న నిర్వహించనున్న ఏఐటీయూసీ జిల్లా శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు. పార్టీ మండల కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 44కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులపై దాడి చేయిస్తుందన్నారు. సమావేశంలో నాయకులు గాలయ్య, శేఖర్‌రెడ్డి, పిల్లి శంకర్, జి.వెంకటేశ్, శంకరయ్య, రాములు, యాదయ్య, నరేశ్, బి.సత్తయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం : సీపీఎం

చౌటుప్పల్, నవంబర్ 2 : ఆరు హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం సీనియర్ నాయకుడు గోశిక స్వామి అన్నారు. మున్సిపాలిటీలోని 10వ వార్డులో శనివారం నిర్వహించిన పార్టీ పట్టణ మహాసభలో ఆయన మాట్లాడారు. నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వడం లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. అనంతరం వార్డు నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గోశిక కరుణాకర్, లోకమోని మల్లేశం, గోశిక అంజయ్య, ఎం.ముత్యాలు, గుర్రం బాలయ్య, జె.శ్రీను, జి.రాజు, చింతల మధుసూదన్‌రెడ్డి, గోశిక సుమతి, దీప, అలివేలు, లలిత పాల్గొన్నారు.